

# నా కళ్ళతో నాన్న

- లిపి మల్లాది



ఆంధ్రుల ఆహ్లాద రచయిత మల్లాది వెంకట కృష్ణమూర్తిగారు ఇటీవల ఫేమిలీ ఆల్బమ్ పేరుతో సొంత అనుభవాలను రచనలో వ్రాశారు. వందల, వేల పాత్రలను సృష్టించిన మల్లాదిగారిని వాళ్ళ అమ్మాయి కళ్ళతో చూస్తే ఎలా ఉంటుంది? అందుకు సమాధానమే ఈ ధారావాహిక. మల్లాదిగారు, పద్మజగార్లకు ముగ్గురు సంతానం - కావ్య, ఊహ, లిపి. ముగ్గురూ అమెరికాలోనే ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు చేస్తున్నారు. చిన్నమ్మాయి లిపి, వాళ్ళ నాన్నగారి గురించి వ్రాస్తున్న ఈ సంఘటనలు పాఠకులకు ఆసక్తికరంగా ఉంటాయని ఆశిస్తున్నాం.

*(గత సంచిక తరువాయి)*

**కొత్త సంవత్సరం** రాగానే ముందుగా అందరూ చేసేది కాలెండర్‌లో ఎన్ని సెలవులున్నాయని లెక్కపెట్టడం, అవి ఆదివారం నాడు వస్తే బుంగమూతి పెట్టడం. మనకి చాలా పండగలున్నా మేము వాటిలో ఐదారు మాత్రమే జరుపుకుంటాం. సంక్రాంతి, దసరా వంటి పండుగలు ఎలా జరుపుతారో నాకు తెలీదు. మా నాన్నకి చిన్నతనంలో ఎక్కువగా నచ్చిన పండగ దీపావళి. ఆ పండగ అయిపోయిన మరుసటి రోజునుండి వచ్చే ఏడాది దీపావళికి ఎన్నిరోజులు అని కౌంట్ డౌన్ చేసేవారట. నా చిన్నప్పుడు మేము కాంపౌండ్ వాల్ నుండి ఇంటి గడప వరకు నూనెదీపాలను పెట్టి అవి ఆరిపోయే సమయానికి తిరిగి నూనెను నింపుతూ మా నాన్న కిందకి వచ్చి ఆ దీపాలని ఎప్పుడు చూస్తారా అని వేచివుండేవాళ్ళం. ఆయన ఆ దీపాలంకరణ చూసి "అబ్బో ఫస్ట్‌క్లాస్‌గా ఉంది" అన్న తరువాతే మేము టపాకాయలను పేల్చేవాళ్ళం. మా మధ్య తగాదా రాకూడదని టపాకాయలను ముగ్గురి మధ్య సమానంగా పంచుకోవడం అలవాటు చేసారు. కావ్యకి ఏడవతరగతిలోనే హైడ్రోజెన్ బాంబ్‌ను పేల్చడం నేర్పారు. నేను చిచ్చుబుడ్డికి కూడా భయపడేదాన్ని. నిప్పుకి, శబ్దానికి దడుచుకుని మా నాయనమ్మ మంచంకింద దాక్కునేదాన్ని. శాస్త్రం కోసం ఆవిడ ఒక్క కాకరపువ్వొత్తు మాత్రమే కాల్చేవారు.

"ఏం భయంలేదు.. ఏంకాదు.. నిప్పు అంటిచ్చి వెనక్కి వచ్చేయడమే.. దట్స్ ఇట్. భయపడకు. నేనిక్కడే ఉన్నాను" అని మా నాన్న ధైర్యం చెప్తూ ప్రేమగా నాతో అన్నీ కాల్పించేవారు. అంత సమయాన్ని కేటాయించి, సహనం కోల్పోకుండా పిల్లలను నేను ఆడించలేను. నాలాంటి తండ్రి నాకు లేకపోవడం ఎంత అదృష్టమో ఇప్పుడే తెలుస్తుంది. వినాయకచవితికి ఉదయాన్నే తలస్నానం చేసి మా నాన్న, కావ్య మోటర్ సైకిల్ మీద వెళ్ళి చిక్కడపల్లినుండి మట్టివినాయకుడి విగ్రహాన్ని తెచ్చేవారట. కొన్నేళ్ళు గడిచాక నేను, కావ్య తన స్కూటీ మీద వెళ్ళేవాళ్ళం. అక్కడ ఐస్‌క్రీం తింటూ నేను కాలక్షేపం చేస్తే లైన్‌లో నిలబడి కావ్య వినాయకుడిని తెచ్చేది. ప్రతీ సంవత్సరం "ఇప్పుడు నువ్వు నేను వచ్చినట్టే చిన్నప్పుడు నేను నాన్నా వచ్చేవాళ్ళం. నీలానే వెనకాల కూర్చుని వినాయకుడ్ని పట్టుకుంటే నాన్న డ్రైవ్ చేసేవాళ్ళు" అని చెప్పేది. పూజ మొదలవడానికి ముందు నేను, కావ్య, ఊహ మాకు వచ్చిన కీర్తనలను పాడేవాళ్ళం, మా నాన్న ఏనాడు

మా కీర్తనల మధ్యలో మాట్లాడలేదు. వినాయకుడి పక్కన పసుపు రాసి మేము మా టెక్స్ట్ బుక్స్‌ని పెడితే మా అమ్మ మా నాన్న నవలలు పెట్టేది. నిజానికి మా తాతయ్యలానే మా నాన్న కూడా విగ్రహారాధన ఇష్టపడరు. కేవలం మా అమ్మ కోసమే పూజచేసేవారు. కావ్య అమెరికాకి వెళ్ళిపోయాక ఇల్లంతా బోసిపోయినట్టు ఉండి వినాయకచవితిని జరపడానికి నేను, మా నాన్న ఇష్టపడకపోవడంతో మేము ఆఖరిసారి వినాయకవ్రతం జరుపుకుంది 2006లో.

ప్రతి ఉగాదికి మేము ఉగాది పచ్చడి చేసుకుంటాం. మొదటి స్పూన్ మా నాన్న తిన్నాక మా అమ్మ మాకు పెట్టేది. కావ్య, నేను, మా నాన్న గిన్నెనిండా పచ్చడి తినేవాళ్ళం. ఊహ ఒక్కదానికే ఉగాది పచ్చడి నచ్చదు. "నీకు ముందు ఏ రుచి వచ్చింది?"... "నాకు స్వీట్ వచ్చింది. నాన్నకి పులుపు వచ్చిందట" ..."అమ్మకి కారం వచ్చిందట" అని మేము ముగ్గురం అదో పెద్ద విషయంలా మాట్లాడుకునేవాళ్ళం. "నాకు స్వీట్ రాలేదు. నా ఇయర్ అంతా ఉప్పగా ఉంటుంది." అని నేను చాలా బాధపడిన సంఘటన నాకు గుర్తుంది.

"నువ్వు అందరితో మాట్లాడుతూ తిన్నావు కాబట్టి అది కౌంట్ అవ్వదు. ఇప్పుడు తినేదే కౌంట్ అవుతుంది" అని నా నోట్లో బెల్లం పెట్టింది మా అమ్మ.

మూఢనమ్మకాలు లేకపోయినా కృష్ణాష్టమినాడు ఊరు ప్రయాణాన్ని ససేమిరా ఒప్పుకోదు. అలాంటి నమ్మకం లేకపోయినా, మా అమ్మకోసం మా నాన్నకూడా ఆ రోజు ప్రయాణం పెట్టరు. అలాంటి నమ్మకాల్లో మా అమ్మకి ఉన్న ఇంకో నమ్మకం బయటికి వెళ్ళే వారిని 'ఎక్కడికి?' అని అడగకూడదు. మా తాతయ్య 'పొలంలో చిన్న పనుందమ్మ' అని ఒక రాత్రి బయటికి వెళ్ళారట. లారీ గుద్దడంతో తిరిగి ఇంటికి రాలేకపోయారు. బయలుదేరేముందు "ఎక్కడికి వెళ్తున్నావు నాన్నా?" అని అడిగినందుకే అలా జరిగిందని నమ్మి మా అమ్మ బాధపడుతుంది. అది చూసి మా తాతయ్య స్వర్గంలో కూడా దుఃఖిస్తుంటారు. కానీ, ఆ ప్రశ్నకి, జరిగిన సంఘటనకి పోలిక లేదని తెలపడం కోసం నేను చాలాసార్లు 'ఎక్కడికి?' అని మా అమ్మ అడిగినప్పుడు మాత్రమే సమాధానమిచ్చేదాన్ని. ఒక్కసారి మాత్రం బాగా కోపగించుకుంది. అప్పుడు మా నాన్న సముదాయించినప్పుడు ఆయనలో ఉన్న ఓర్పుని, మా అమ్మ పట్ల ప్రేమని చూసాను. ఊహ మా అమ్మతో పోట్లాడినప్పుడు, బయటవారు మొహమాటపెట్టినప్పుడు మా అమ్మ ఇబ్బందిని గ్రహించి పరిస్థితిని ఆయన చేతిలోకి తీసుకుంటారు. కట్టే, కొట్టె, తెచ్చెలా మాట్లాడడం వల్ల ఆ సంభాషణ అనవసరపు మాటల్లోకి మారదు.

ఈ సంవత్సరం ఫిబ్రవరిలో మా అమ్మ పుట్టినరోజుకోసం **'గాడ్‌బ్లెస్ ద కైండ్, కేరిం, మేగ్నిఫిషియెంట్ మామ్' అనే కప్పునుకొని బహుమతిగా ఇవ్వమని నాకు ఇచ్చారు.** పెళ్ళిల్లు, పేరంటాలు ఇష్టంలేకపోయినా కేవలం మా అమ్మకోసం మా బంధువుల పెళ్ళిల్లు దాదాపు అన్నింటికీ హాజరయ్యారు. "అమ్మకి ఇలా చేసి ఇవ్వు... అమ్మకి ఆ రంగు ఇష్టం. అమ్మకి ఇది నచ్చుతుంది అమ్మకి ఒంట్లో బాలేదు, అల్లరి చెయ్యకు.." అని నాతో చాలాసార్లు అన్నారు. పైకి కనబడకపోయినా, మాటల్లోకాక చేతల్లో ఆయన ప్రేమని తెలుపుతుంటారు. వారి మధ్య ఎన్ని తగవులున్నా, మా అమ్మ మాత్రమే సరైన జోడీ అని తెలుసు కాబట్టి సత్యాన్ని ప్రపంచంనుండి దాచలేదు.

తన 'అందమైన జీవితం' మా అమ్మకి డెడికేషన్ అని భావించవచ్చు. తన తప్పులను కప్పిపుచ్చుకోకుండా ఫేమిలీ ఆల్బంలో మా అమ్మ గురించి రాసినది చదివాక 'ఇంతగా ప్రేమించడం సాధ్యమా?' అని నేను ఆశ్చర్యపోయాను. మా అమ్మ రాసే కథలను, కవితలను ఎవ్వరైనా పొగిడినా, "మీ కన్నా మీ ఆవిడే బాగా రాసింది" అని చెప్పినా ఈర్ష్య పడకుండా గర్వంగా నవ్వడం నా కళ్ళారా చూసాను. ముక్కు మీద కోపం వల్ల తరచూ పోట్లాడినా వారి మధ్య ప్రేమ వలనే ఈ రోజుకీ కలిసి ఉన్నారు. కుటుంబ విలువ తెలుసు కనకే మా అమ్మ, నాన్న సర్దుకుపోయి సంతోషంగా జీవిస్తున్నారు. ఆ మనస్తత్వమే కావ్య, ఊహకి కూడా వచ్చింది. మా అమ్మకి ఉన్న సహనం కావ్యకి, నాన్నకి ఉన్న కోపం ఊహకి వచ్చాయి. కొట్టుకుంటూ తిట్టుకుంటూ కలసి ఉండేకంటే విడివిడిగా సంతోషంగా ఉండడమే నయం అనేది నా ఉద్దేశం.

మా అమ్మకి ఉన్న లంగ్ ప్రాబ్లమ్ వల్ల నేను మూడవతరగతిలో ఉన్నప్పుడు ఒక ఉదయం రక్తం వాంతు చేసుకోవడం చూసి మా నాన్న భయపడి వెంటనే హాస్పటల్‌కి తీసుకువెళ్ళారు. చెయ్యి పట్టుకుని కార్లో కూర్చోపెట్టినప్పుడు మా నాన్న చెయ్యి వణకడం చూసి మా అమ్మకి నవ్వొచ్చిందంట. ఇలాంటి విషయాల్లో చాలా భయపడే వ్యక్తి మా నాన్న. చిన్నప్పటినుండి ఎదురైన పరిస్థితులకి మా అమ్మ గుండె ధైర్యం పెరిగినా, కోమలత్వాన్ని కోల్పోలేదు. ఎంత క్లిష్టమైన పరిస్థితిలో ఉన్నా "అంతేగా!" అని నవ్వే శక్తి కేవలం మా అమ్మకి మాత్రమే ఉంది. ఆ సంఘటన ఉదయం ఆరింటికి జరగడంతో నేను సాయంత్రం స్కూల్‌నుండి వచ్చాకే ఏం జరిగిందో తెలుసుకున్నాను. కావ్య చాలా భయపడి బాధపడింది. మా నాన్నలా తను చాలా సెన్సిటివ్. ఊహ ఆ రోజు ఉదయం "అమ్మ ఇంట్లో లేదు. నేను స్కూల్‌కి వెళ్ళకుండా ఇంట్లో ఉండి టీవీ చూసుకోవచ్చు" అన్న మాటలను గుర్తుచేసుకుని మా చుట్టాలు ఇప్పటికీ నవ్వుతుంటారు.

మా నాన్న రాసుకునే పనులు, హాస్పిటల్ పనులు, మా భోజన సదుపాయాలతో బిజీగా ఉండడం చూసి కావ్య సగం పనులను తన భుజాలపై వేసుకుంది. ఇంట్లో వంట చేయడం, తన హోంవర్క్స్ చేసుకుని నన్ను చదివించడం, సాయంత్రాలు మా అమ్మతో గడపడం, ఉదయాన్నే నన్నూ, ఊహని స్కూల్‌కి పంపడం వంటి పనులను చేస్తూ, విసుక్కోకుండా అంత చిన్న వయసులో అన్ని బాధ్యతలను మోసింది. సర్జరీ చేయవలసిన అవసరం ఉందని చెప్పిన డాక్టరు అది చాలా రిస్కీ అని కూడా చెప్పారు. దాంతో మా నాన్న బాధ, భయం కోపంగా మారినా మా ముగ్గురిపై ఒక్కక్షణం కూడా చూపలేదు. ఆ కొన్ని రోజులు ఆయన ముఖంలో నవ్వులేకపోవడం నాకు గుర్తుంది. మా చుట్టాలందరూ హాస్పటల్లో నవ్వుతున్నా, మా అమ్మ హాస్యంగా మాట్లాడినా, మా నాన్న మాట వరసకికూడా నవ్వలేకపోయారు. ఆయన ముఖంలో బెంగ బాగా కనపడింది. సర్జరీకి వేరే హాస్పటల్‌కి తీసుకువెళ్ళినప్పుడు మా అమ్మ నన్ను రానివ్వలేదు. హాస్పిటల్ వాతావరణం మా అమ్మకి నచ్చదు .ఆరేళ్ళ వయసున్న నన్ను రోగాలకి, మనుషుల ఏడుపుకి దూరంగా పెట్టాలన్నది తన ఆలోచన. ఇరవై ఆరేళ్ళ వయసువచ్చినా నన్ను హాస్పిటల్‌కి వద్దంటుంది. సర్జరీ పూర్తి అయి రూంకి మార్చాక కూడా నన్ను రానివ్వకపోవడంతో ఇంట్లో ఏడ్చి గోల చేసినా మా అమ్మ మాటకి విలువిచ్చి నాకు మాయమాటలు చెప్పి కావ్యతో ఇంట్లో ఉండమన్నారు మా నాన్న.

మా అమ్మ నా హృదయంపై గాయాలు కానివ్వకుండా ఎంత కాపాడినా నేను హాస్పిటల్‌లో పనిచేస్తున్నప్పుడు ఎంతో మంది ఆర్తనాదాలు విన్నాను. "ఈ సంగతి తెలిస్తే తను ఎలా రియాక్ట్ అవుతుందా?" అని ఒక డాక్టర్‌తో చర్చించాను.

"షీ విల్ బి ప్రౌడ్ ఆఫ్ యు" అని ఆయన బదులిచ్చారు.

"వెరీగుడ్" అని మా నాన్న చెప్పినా, "హాయిగా ఇంట్లో కూర్చోక ఈ హాస్పిటల్ గోల ఎందుకమ్మా?" అని మా అమ్మ అంది.

దురదృష్టవశాత్తు ఆ లంగ్ ప్రాబ్లమ్ తిరిగి వచ్చింది. తను దగ్గిన ప్రతీసారి నా గుండె కలుక్కుమంటుంది. డాక్టర్ చెప్పిన జాగ్రత్తలను అస్సలు పాటించదు. ఆరోగ్య విషయంలో మా నాన్న మాటని కూడా వినదు. 'నీకు పెళ్ళి చేస్తే బాధ్యతలు పూర్తవుతాయి' అని నాకు పెళ్ళి ప్రయత్నాలను చేయడంలో మా నాన్న సహాయపడుతున్నా, అది సరికాదు అని నాకు అనిపించడంతో ప్రయత్నాలను ఆపమన్నాను. వారికి ఇష్టంలేకపోయినా నాకు నచ్చని పని చేయడం ఇష్టంలేక అసంతృప్తితో వదిలేసారు. కొన్ని సంవత్సరాలక్రితం మా నాన్నకి జరిగిన ఒక చిన్న ఆపరేషన్ గురించి నాకు చెప్పలేదు. "దూరంగా ఉన్నవాళ్ళకి ఇలాంటి విషయాలు చెప్పి నొప్పించకూడదు" అని మా అమ్మ తరచూ అంటుంది.

ఇలాంటి పరిస్థితుల్లో వాళ్ళిద్దరిని వంటరిగా వదిలేయడం ఇష్టంలేక నేను తిరిగి ఇండియాకి వెళ్ళిపోవాలని నిశ్చయించుకున్నాను. మొదట్లో ఒప్పుకోకపోయినా ఇప్పుడు నేను ఇంటికి వెళ్ళడం వాళ్ళకి ఇష్టమే అని చెప్పారు. "నువు ఇండియాలో ఉద్యోగం చేయలేవు లిపి, ఇండియాలో ఇంత ఫ్రీడం ఉండదు..", "జాబ్ ప్రాబ్లం అయితే వేరే జాబ్ చూసుకో", "హోం సిక్‌నెస్ అయితే మీ అక్కలున్నారుకదా.." అని నా స్నేహితులు ఒకొకరు ఒక్కో సలహా ఇచ్చారు.

"వైడూ యూ వాంట్ టు క్విట్? డూ యూ నీడ్ ఎ రైజ్?" అని మా ఆఫీసు వాళ్ళు నన్ను ప్రశ్నించి ప్రమోషన్ ఇచ్చారు. కావాలంటే రెండు మూడు నెలలు సెలవు తీసుకోమన్నారు. కానీ ఇది కాలక్షేపానికి పెట్టుకునే ప్రయాణం కాదు. సౌకర్యాలకోసమో, ఉద్యోగం - డబ్బు కోసమో నేను ఇక్కడే ఉండిపోతే జీవితంలో అద్దంలో నా మొహాన్ని కూడా చూసుకోలేను. కెరియర్ కన్నా ఫామిలీనే ముఖ్యం అని నాకు నేర్పిన తల్లిదండ్రులను ఇలాంటి పరిస్థితుల్లో కెరియర్ కోసం వంటరిగా వదలలేకపోవడం వల్ల జూన్‌లో వెనక్కి వెళ్ళిపోతున్నాను. ఇది వాళ్ళు అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నాను.

(నాన్నకబుర్లు మరిన్ని వచ్చేనెలలో)

Click here to share your comments on this story